

# ఎందుకే నీకింత తొందరా...

## - బలభద్రపాత్రుని రమణి



### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో బహుమతి పొందిన ఉత్తమ నవల

### (గత సంచిక తరువాయి)

**అమితాబ్ బచ్చన్‌ది** ఫేమస్ డైలాగ్..."నా దగ్గర ఇంత ఆస్తివుంది నీ దగ్గరేం వుంది?" అని,

శశికపూర్ "మేరే పాస్ మా హై" అంటాడు.

అమితాబ్ కళ్ళల్లో నీటితెర.

పంచ్ వేసింది శశికపూర్. అయినా అమితాబ్ ఆ ఎక్స్‌ప్రెషన్‌కి జనం ఫిదా!

'మా' అనే మాటలో అంత సెంటిమెంట్. అంత పవర్.

దూరంగా వున్నప్పుడు ఇంత ప్రేమ.. దగ్గరకి వెళ్ళగానే వసుంధర మీద ఎంత అధారిటీ చూపిస్తానో, అన్నింటికీ టీజ్ చేస్తాను. "అమ్మా ఐ మిస్ యూ" అని నేను అన్నా, అదీ వ్యంగ్యమే అనుకుంటుంది నా పిచ్చితల్లి.

సూట్‌కేసుల మీద కూర్చుని గుర్రం ఆట ఆడి మామయ్య వెయిట్ చూసి "ఆ నట్స్ పాకెట్ ఇందులో పెట్టు, పుస్తకాలు నేను తర్వాత పంపిస్తాలే తీసెయ్.. చాక్‌లెట్స్ హాండ్ లగేజ్‌లో వేసుకో" ఇలా బోలెడు మార్పులూ చేర్పులూ చేసాక, అన్నీ బయట హాల్లో పెట్టాను. ట్రావెలింగ్‌లో హాయిగా వుండడానికి వైట్ షర్ట్, కాటన్ త్రీ ఫోర్త్ ప్యాంట్ వేసుకుని, జుట్టూ రిబ్బన్‌తో కట్టుకున్నాను.

అత్తయ్య పిలిచి నుదుట బొట్టుపెట్టి, పట్టిచీర పెట్టింది. కనకాంబరం రంగుకి నేవీ బ్లూ అంచు. మెరిసిపోతోంది.

"ఇది ఎక్కడిది నీకూ?" అన్నాను.

"ఇండియానుండి ఎన్నో తెప్పించాను. ఈ ఇయర్ పరి పెళ్ళి వుంటుందని" అంది.

ఒంగి అత్తయ్య కాళ్ళకి దణ్ణం పెట్టాను.

"ద్వారకని విడిచి పెట్టకు. చేసుకునొచ్చెయ్ నాకు దగ్గరగా వుంటావు" అంది.

మన దగ్గర జవాబులు లేనప్పుడు అన్నింటికీ వెర్రి నవ్వే సమాధానం.

ద్వారక వైట్ అండ్ బ్లాక్‌లో, సన్‌గ్లాసెస్ పెట్టుకుని హీరోలా వచ్చాడు.

మావయ్యనీ అత్తయ్యనీ విష్ చేసి నా సూట్‌కేసెస్ కార్లో పెట్టాడు.

"నేనూ వెళ్ళనా?" మామయ్య అంటే "హుష్.. సరదాగా వెళ్ళనీయండి ఇద్దరినీ" అంది అత్తయ్య.

చాలాసార్లు ఆడవాళ్ళు సూక్ష్మగ్రాహులుగా వుంటారు.

కారు కదిలేదాకా అత్తయ్య జాగ్రత్తలు చెప్తూనే వుంది.

కదిలాక, ద్వారక నన్ను దగ్గరకి తీసుకుని "థాంక్స్ అమ్మని కలిసినందుకు" అన్నాడు.

"ఇటుచూడు" నా కుడిచేతి ఉంగరం వేలు చూపిస్తూ అన్నాను.

"చెప్పింది. చాలా సెంటిమెంటల్ మా ప్రొఫెసర్" అన్నాడు.

"మా వసుంధర కూడా" అన్నాను.

"ఎందుకలా అనిపించిందీ? అమ్మని కలవాలని?" అన్నాడు.

"ఊరికే అన్నాను. అబద్ధమాడాను. మా సంభాషణ గురించి దేవకిగారు ఏం చెప్పలేదనమాట.

"నా గిఫ్ట్ ఇచ్చెయ్యి" కారు ఆపినప్పుడు ట్రాఫిక్ జామ్ లో అడిగాడు.

ఇష్టంగా అతని వైపు జరిగాను.

అతను కొద్దిగా వంగి నా పెదవులు అందుకున్నాడు.

"ఇదే చివరి ముద్దు కాకూడదని" ఆశపడ్తున్నాను. కార్ స్టార్ట్ చేసూ అన్నాడు.

"బీ పోజిటివ్" అన్నాను.

"ఒక్కోసారి మన సిద్ధాంతాలు ఎదుటివారికి పట్టుదలగా, అహంకారంగా కనిపించి కూడా దూరం అయ్యే ఛాన్స్‌లుంటాయి" అన్నాడు.

"బాండ్ పేపర్ మీద అగ్రిమెంట్ రాసుకుందామా. ఒకరి మీద ఒకరికి ఇంట్రెస్ట్ తగ్గితే విడిపోతాం అనీ" అన్నాను.

అతను మాట్లాడలేదు మళ్ళీ పెదవుల మీద ముద్దు పెట్టి "మై హగ్స్ ఆర్ మై ప్రామిసెస్. మై కిసెస్ ఆర్ మై ఎగ్రిమెంట్స్.. మై ఫీలింగ్స్ ఆర్ మై బాండ్స్" అన్నాడు.

సెక్యూరిటీ చెక్ ఇన్ వైపు వెళ్ళేటప్పుడు ఇంకో ప్రామిస్. ఐ మీన్ లాస్ట్ కిస్ ఇచ్చాడు.

ఫ్లయిట్ ఆకాశంలో ఎగుర్తుండగా, నా కుడిచేతి ఉంగరం చూసుకుంటూ "నో.. ఐకాంట్ లీవ్ హిం అనుకున్నాను.

ఇండియాకి వచ్చిన తర్వాత అమ్మా నాన్నా విలువ బాగా తెలిసినట్లయింది. అసలు చాలా విలువలు తెలిసాయి. బోధి వృక్షం కింద బుద్ధుడికి జ్ఞానోదయం అయినట్లు నాకు ఈ ఊళ్ళో జ్ఞానోదయం అయింది.

అదేం ఊరూ? అనుకుంటున్నారా?

సఖినేటి పల్లెని ఆనుకుని వున్న ఈ చిన్న గ్రామంలో నేను అడుగుపెట్టినప్పటినుండీ ఎన్నో విషయాలు అర్థం అవుతున్నాయి.

"ఇలా వెతుక్కుంటూ వచ్చెయ్యడమేనా? ఇది ఇంకా పల్లెటూరే" అన్నాడు ధీరజ్.

కోనసీమ అందాలని వినడమే కానీ నాకు చూసే భాగ్యం కలుగుతుందనుకోలేదు. అసలు భావుకత్వం లేని వాళ్ళని చెరుకు గెడ తీసుకుని కొట్టాలి. చేతిలోఈ వున్న చెరుకు గెడని సినిమాలో హీరోయిన్‌లా పళ్ళతో పీకేసి "ఆజ్ ఫిర్ బీ నే కీ తమన్నా హై... ఆజ్ ఫిర్ మర్ నే కీ ఇరాదా హై" అని పాడెయ్యడానికి. దగ్గర్లో బి.డి.ఎస్ వాళ్ళు ఎవరైనా వున్నారా చూసుకోవాలి.

ధీరజ్ చెరుకు నోటితో లాగి, రసం పీలుస్తున్నాడు.

"నీ పేస్ట్‌లో ఉప్పువుందన్నమాట" అన్నాను.

"నీ బుర్రలో మాత్రం పిచ్చివుంది" చిరు కోపంగా అన్నాడు.

"నేను ఇట్లా రావడం వల్ల మీ ఇంట్లో వాళ్ళు ఏవనుకుంటారోననా నీ బాధ?" అన్నాను.

"కాదా? మందాకినిని చేసుకుంటానని చెప్పేసాక, నువ్వీ రాయబారం తీసుకురాడమే బాగోలేదు. పైగా వయసులో వున్న అందమైన అమ్మాయి బ్యాక్ ప్యాక్ వేసుకుని రైల్లోంచి దూకి, బండి ఎక్కి, ఆ పైన లాంచీ ఎక్కి రావడం. తెలుగు సినిమాల్లో బావుంటుంది కానీ నిజజీవితంలోకాదు" అన్నాడు.

"నేను ఫోన్‌లో వస్తాను అన్నప్పుడు ఇవన్నీ చెప్పలేదేం?" అన్నాను.

"నిజంగా వస్తావు అనుకోలేదు. ఇంత ప్రాక్టికాలిటీ లేని ఫూల్‌వని ఊహించలేదు" అన్నాడు.

ఇద్దరం సరదాగా బల్లకట్టు మీద కబుర్లు చెప్పుకోవలసింది. అతని చాదస్తం వల్ల తిడుతున్నాడు.

"సరేకానీ.. ఈ కాలవ చుట్టూ కొబ్బరి చెట్లు చూస్తే నీకేమనిపిస్తోందీ?" అన్నాను.

"చిన్నప్పటినుండీ చూస్తూనే వున్నా. పాపం నిలబడేవున్నాయి" అన్నాడు.

"గోదారమ్మ నడుముకి పెట్టిన పచ్చలు పొదిగిన వడ్డాణంలా లేదూ?" అన్నాను.

"నీలో ఈ కవిత్వం అనే పైత్యం కూడా వుందా?" అన్నాడు.

"భావుకత్వం నీ ఫ్రెండ్‌కే అనుకున్నాను. నీకు లేదనమాట. ఆ ఆకాశంలో గుంపులుగా ఎగిరే కొంగలు రాత్రికాగానే వెలిగే తారకలేమో.. అనిపించడంలేదూ?" అన్నాను.

"ఎప్పటినుండీ ఇలా అనిపిస్తోందీ?" సీరియస్‌గా అడిగాడు.

"ఇది పిచ్చికాదు. నాలో వున్న రచయిత్రి మాట్లడే భాష" అన్నాను.

"అవునా?" ఆశ్చర్యంగా అడిగాడు.

"నువ్వు మాట్లాడేటప్పుడే పల్లెటూరు నుండి వచ్చావని స్వచ్ఛమైన మట్టి వాసనల్లాంటి నీ మాటలు చెప్పాయి"

"అంటే చెమట వాసనా, మట్టివాసనా వచ్చాయా? శుభ్రంగా రోజూ రెండుసార్లు స్నానం చేస్తాగా" అన్నాడు.

"కిడ్డింగ్ చాలు. సీరియస్‌గా మాట్లాడేసుకుందాం. మళ్ళీ ఇంటికి వెళ్తే మీ వాళ్ళంతా వుంటారు. పరిమళ నిన్ను చాలా ప్రేమిస్తోంది" అన్నాను.

"అందుకే నాకు చెప్పకుండా ఇంకో పెళ్ళిచేసుకుని నన్నూ ఆ సవతితో కలిసి బతకమంటోందా?" మండిపడ్డాడు.

"నాట్ ఏ బ్యాడ్ ఐడియా!" అనేసి, అతను ఇంకా కోపంగా చూడడంతో నాలిక కొరుక్కుని,

"సంవత్సరంలో డివోర్స్ తీసుకుని, నీ దగ్గరకి వచ్చేస్తానంటోందిగా" అన్నాను.

"అది అంత ఈజీకాదు. పరిమళ అమాయకత్వం" అన్నాడు.

"సంవత్సరాల తరబడి ప్రేమించుకుని, పెళ్ళాడి ఇద్దరు పిల్లల్ని కూడా కనేసి, 'నీకూ నాకూ పడదు అని విడిపోయే వాళ్ళున్నప్పుడు' ఇదేమంత కష్టం అని" అన్నాను.

"నీకు ప్రేమ అన్నా పెళ్ళి అన్నా పెద్ద సెంటిమెంట్‌లేనట్లుంది. ఆ స్వచ్ఛత అనుభవించనప్పుడు ఎందుకా పెళ్ళి?" కోపంగా అన్నాడు.

"సరే! మందాకినిలో ఏం చూసావు చెప్పు. ఇంత త్వరగా మనసు మార్చుకున్నావు?" అన్నాను.

"పల్లెటూరు పిల్ల ఇలా స్వేచ్ఛ  అని బరి తెగించి, పిచ్చి పనులు చెయ్యదు. అది చాలు అమ్మా తాతయ్యా ఆనందంగా వుండడానికి" అన్నాడు.

"మీ అమ్మా, తాతయ్యా ఆనందంగా వుండడానికి చేసుకుంటున్నావా? లేక అనాఘ్రత పుష్పం అని చేసుకుంటున్నావా?" అన్నాను.

"కం అగైన్. ఏం పుష్పం?" అన్నాడు.

"అదేలే... ఆమె వర్జిన్ అని చేసుకుంటున్నావా? అని పొయిటిక్‌గా అడిగాను" అన్నాను.

"ఆడపిల్లకి తెగింపూ ఆ పైన భావుకత్వంకూడా వుంటే అర్థం అవడం, భరించడం చాలా కష్టం. మా అమ్మా తాతయ్యల ముందు ఇలా మాట్లాడకు" అన్నాడు.

"పరిమళ విషయానికొద్దాం. ఈ ఏడు ఎలాగో అలా గడిపేసెయ్. తర్వాత ఆ వెర్రిపిల్లని పెళ్ళిచేసుకో. కంటికీ మింటికీ ఏకధారగా ఏడుస్తోంది" అన్నాను.

"ఇట్స్ మై లైఫ్.. షీ ఈజ్ మై వైఫ్ అన్నప్పుడో? ఏడుపూ లేదూ ఏమీ లేదూ" అన్నాడు.

"పిచ్చివాడా. నీలాంటి మూర్ఖులు నిజమైన ప్రేమని గ్రహించలేక పోగొట్టుకుని, ఆ తర్వాత జీవితం అంతా ఉమర్ ఖయ్యాంలా, రుబాయీలు చెప్పుకుంటూ ఏడుస్తారు తెలుసా?" అని గట్టిగా అరవాలనిపించింది.

ఇంతలో బల్లకట్టు, గట్టు చేరింది. ధీరజ్ దిగి తన చేతిని అందించాడు. నడి నెత్తిన కొప్పు పెట్టి ఎల్లో లూజ్ కాటన్ షర్ట్, క్వాడ్రాయ్ జీన్స్‌లో బౌద్ధ సన్యాసినిలా కనిపిస్తున్నానేమో, అక్కడ వాళ్ళంతా కొంచెం వింతగా చూస్తున్నారు.

"సీత ఆంటీ తమ్ముడి కూతురివి. కోనసీమ చూడ్డానికొచ్చావ్. అంతే చెప్పు. నీ బోడి రాయబారాల సంగతి చెప్పకు ఇంట్లో" అన్నాడు.

నేలంతా కొంచెం బురదగా వుంది. చెప్పులు చేతిలో పట్టుకుని నడుద్దామా అనుకుని, అమ్మో కాళ్ళు డైరెక్ట్‌గా బురదని తగలడమనే అనుభూతి వూహించలేను. అని జర్రున జారుతూ, 'కెవ్వు'న కేకేసి, ధీరజ్ భుజం పట్టుకుని ఆపుకున్నాను. పక్కన ఏదో 'ఘర్ర్' మన్న సౌండ్ చూస్తే పంది ఒకటి, రాసుకుంటూ పోతోంది.

"ఓ మైగాడ్!" అన్నాను.

"చెప్పు. ఆ బురదలో దొర్లుతున్న పందిని చూస్తే, సూర్యుడి కోసం ఎదురు చూస్తున్న కలువ దరహాసం గుర్తుకు రావడం లేదూ?" అన్నాడు.

"చీప్ కంపేరిజన్" అన్నాను.

"రచయిత్రివి కదా" నవ్వాడు. మొదటిసారి నవ్వాడు నేనొచ్చాకా, "అరెరే! భలే బావున్నావు నవ్వుతుంటే .. అందుకే మా పరి పడిపోయి ఫిదా అయిపోయింది నీకు" అన్నాను.

ఇద్దరం దేవాలయం ముందు నుండి వస్తుంటే, ధ్వజ స్థంభం మీద వాలిన పక్షులన్నీ ఒక్కసారిగా ఎగిరి, స్థంభానికున్న చిరుమువ్వలన్నీ ఒక్కసారిగా జలతరంగణి మ్రోగించినట్లు, గణగణలాడాయి. లోపల నుండి రుద్రం వినిపిస్తోంది. నేతి వాసనలు కూడా.

"ఇంకా ఎంత దూరం ఇల్లు?" అడిగాను. అరిటి గెలలు మోసుకుంటూ వెళ్తున్న సైకిల్ వాళ్ళు, మమ్మల్ని విచిత్రంగా చూస్తూ, వెళుతున్నారు.

"దగ్గరే. ఏం? కాళ్ళు నొప్పులా?" అడిగాడు.

"మీకు కారు కానీ స్కూటర్ కానీ లేదా?" అడిగాను.

"ఉంది" అన్నాడు.

"మరి నన్ను రైలు దింపి, బండీ.. ఆ తరువాత బల్లకట్టు ఎందుకు ఎక్కించావ్?" అడిగాను.

"నువ్వు అనాలోచితంగా ఇలా వచ్చినందుకు విచారించాలని" అన్నాడు.

"మంచిపని చేసావ్. నేను చాలా ఎంజాయ్ చేసాను జర్నీ" నవ్వుతూ చెప్పాను. ఆగి దేవాలయాన్ని కొన్ని ఫోటోలు తీసాను.

"పద... లేట్ అవుతోంది. చీకటి పడితే వీధి దీపాలు కూడా లేవు" అన్నాడు.

కావిళ్ళతో కూరగాయలూ, బిందెలు చంకన పెట్టుకుని కాలవనుండి నీళ్ళు మోసుకెళ్ళడం అన్నీ నాకు అబ్బురంగా అనిపించి వాళ్ళకి ఫోటోలు తీసాను.

"ఇదే మా ఇల్లు" అన్నాడు ధీరజ్.

పెంకుటిల్లు. కాంపౌండ్ గేట్ తీసుకుని లోపలికి వెళ్తే ఎత్తు అరుగులు వున్నాయి. 'ఇంటికి ఎవరో చుట్టాలొచ్చారు. అని చెప్తున్నట్లు, ఒక పికిలి పిట్ట, ఇంటిముందున్న పున్నాగ చెట్టుమీదనుంచి అదే పనిగా అరిచింది.

ప్రాంగణంలో తులసికోటలో దీపం వెలుగుతోంది. పేడనీళ్ళు కల్లాపి జల్లి, తెల్లటిఒ బియ్యం పిండి ముగ్గులు పెట్టారేమో. అదో రకం వాసనలొస్తున్నాయి. వాటికి వాకిలికి ఇరుపక్కల వున్న పారిజాతం, పున్నాగల సువాసనలు తోడయ్యాయి.

"అమ్మా" అని పిలిచాడు ధీరజ్.

"ఆ... వస్తున్నా" అన్న అరుపు తర్వాత, జారుముడితో, ఎర్రని మంకెన పువ్వులాంటి చీర కట్టుకున్న పెద్దావిడ బయటకి వచ్చింది.

ఆవిడ నుదుటిమీద విభూతీ, చెవులకున్న రాళ్ళ దుద్దులూ ధగధగలాడుతున్నాయి.

"అమ్మా.. ఈ అమ్మాయి పేరు రుష్యేంద్రమణి" అన్నాడు.

ఆవిడ అందమైన మొహంలో నవ్వు కనిపించింది.

చార్లీ చాప్లిన్ తెరమీదకి రాగానే ఇంకా ఏమీ చెయ్యకుండానే నవ్వేస్తారు. అలాంటిదే నా పేరుకూడానేమో.

"లక్షణమైన పేరు.. రామ్మా" అని

"గౌరీ చెంబుతో నీళ్ళియ్యి కాళ్ళు కడుక్కుంటారు" అందావిడ.

ఈ బురదతో లోపలికొచ్చేస్తానని భయపడినట్లున్నారు. మా ఇంటికి ఎవరొచ్చినా "చెప్పులేం ఇప్పక్కర్లేదు లెండి.. రండి" అంటుంది అమ్మ.

ఇలా కాళ్ళకి నీళ్ళు ఇవ్వడం, వినడమే తప్ప చూడలేదు.

షూస్ విప్పి, సాక్స్ కూడా తీసాక, కాళ్ళు కడుక్కున్నాను.

గౌరి గాబులోంచి నీళ్ళు అందిస్తూ, వింతగా చూస్తూనే వుంది.

నేను లోపలికి రాగానే, అరవిందగారు నన్ను దగ్గరకి తీసుకుని "మా సీత ఎలా వుంది? దాని పోలికలు నీలో ముమ్మూర్తులా కనిపిస్తున్నాయి. ఎంతైనా మేనత్త పోలికలు, మేనమామ బుద్ధులూ తప్పక వస్తాయి" అంది.

గోడల నిండా వరుసగా, పక్షపాతం లేకుండా దేవుళ్ళు అందరూ కొలువు తీరారు. అన్ని ఫోటోలకూ పూలమాలలూ, అగరుబత్తులూ సాంబ్రాణి వాసనొస్తున్నాయి.

"అత్తయ్య బావుంది. మిమ్మల్ని చాలా తలుచుకుంటుంది" అన్నాను.

"ఇద్దరం కలిసి పెరిగాం. మా నాన్నగారి దగ్గర ట్యూషన్ కొచ్చేది. కానీ రాత్రుళ్ళు కూడా ఇక్కడే అన్నం తిని, ఒకే మంచం మీద పడుకుని, తెగ కబుర్లు చెప్పుకునేవాళ్ళు. ఆవిడ ఆపకుండా అత్తయ్య మీద వున్న ప్రేమని కబుర్లుగా మార్చి కదంబం అల్లుతోంది.

"తాతయ్య లేరా?" ధీరజ్ అడిగాడు.

"ఉన్నారు. జపం ఇంకా కాలేదు" అంది.

నాకు చెక్క కుర్చీ వేసి "కూర్చో అమ్మా... కాఫీ తాగుతావా? పాలా?" అందావిడ.

"కాఫీ ఇవ్వు" ధీరజ్ చెప్పాడు.

"ఇందాకే ఫిల్టర్ వేసా. మా సీతకి కూడా, అప్పుడే తీసిన డికాషన్‌తో కాఫీ అంటే ఎంత ఇష్టమో?" అందావిడ.

జ్ఞాపకాల చెట్టుకి నీళ్ళు పోస్తున్నారా? ఓనాటి ఆ నేల రాలిన పారిజాతాలని ఏరుకుంటున్నారా? అనిపించింది. బహుశా ఈ రోజుల్లో ఇలా స్నేహాలని తలుచుకునే తీరిక ఈ జనరేషన్ వాళ్ళకి లేదేమో. ఫేస్ బుక్‌లో స్నేహాలు బయట కనిపిస్తే గుర్తుపట్టలేము. నాలుగు రోజులు పోస్టులు పెట్టకపోతే 'బహుశా పోయి వుంటారు" అని తేలిగ్గా తీసుకునే మనస్తతాలు. ఈవిడ దాదాపు నలభై ఏళ్ళ క్రితం స్నేహపు తీపి గుర్తులని ఎంత ఫ్రెష్‌గా పంచుతున్నారూ?

పరి చేసిన పనికి అత్తయ్య అంతగా ఎందుకు బాధపడిందో, ఈ స్నేహ సౌరభాలని చూస్తే అర్థం అయింది. మలినం అంటని మంచి గంధంలా చల్లగా వుంది ఆ స్నేహం.

గౌరి కాఫీ తీసుకొచ్చి ఇచ్చింది.

"ఎవరొచ్చారు?" అంటూ మహదేవయ్యగారు బయటకొచ్చారు.

బక్కపలచగా, తెల్లని ధోవతిలో నుదుట అడ్డంగా విభూతీ, మధ్యలో కుంకుమ బొట్టుతో పవిత్రంగా కనిపించారు.

పెద్దవాళ్ళు కనిపిస్తే వంగి కాళ్ళకి దణ్ణం పెట్టాలని నాన్నగారు చాలా సార్లు చెప్పినా అలవడలేదు. లేచి నిలబడ్డాను.

"మన గోపాలక్రిష్ణ కూతురు. సీత మేనకోడలు. అలా అంటే తెలుస్తుంది నాన్నగారికి" అంది ఆవిడ.

"కూర్చో అమ్మా" ఆయన హాలు మధ్యలో వున్న ఉయ్యాల బల్లమీద కూర్చున్నారు.

"చెప్పమ్మా అంతా ఎలా వున్నారూ? మా ధీరూని చాలా బాగా చూసుకున్నారు శేఖరం సీతా. తండ్రిలేని పిల్లవాడు. అంత దూరం పంపామని తెగ బాధపడ్డాం. సీత దగ్గర వున్నాడని తెలిసాక, నిశ్చింతగా ఊపిరి పీల్చుకున్నాం" అన్నారు.

నేను వాళ్ళ ఊరు చాలా బావుంది అని మెచ్చుకున్నాను. గోడవారగా అద్దాల బీరువాలో నిలువునా వీణని చూస్తూ "ఎవరు వాయిస్తారండీ?" అని అడిగాను.

"మా అరవింద" అన్నారు తాతగారు.

"అయితే వినాల్సిందే" అన్నాను.

"ఏదో లే అమ్మా పెళ్ళి చూపులకోసం నేర్చుకున్న సంగీతం" ఆవిడ నవ్వారు.

"ఫ్రెష్ అప్ అయిరా. గౌరీ మేడమీద గది చూపించు" అన్నాడు ధీరజ్.

"రామ్మా" అరవింద మేడ మీదకి తీసుకెళ్ళారు. ఆ చెక్కమెట్లు 'కిర్ కిర్ మంటు' 'సరిగమపని' అని మోగుతున్నట్లు అనిపించాయి.

గదిలో పందిరి పట్టెమంచం వుంది. ఒక పొడవాటి పెడస్టల్ ఫ్యాన్. గోడకి ఓ రాధాకృష్ణుల పెయింటింగ్. అలమరలో కొన్ని పుస్తకాలు. ఆనుకుని వున్న బాత్‌రూం.

రెండురోజులు గడిచాక, అసలు వీళ్ళు ఇంత స్వచ్ఛంగా ఎలా వుండగలరూ? అనిపించింది.

"అమ్మా మొక్కలకి అయినా, బంధుత్వాలకి అయినా ఎరువు ముఖ్యం.. బంధుత్వాలకి ప్రేమతో పాదులు చేస్తే త్వరగా ఫలిస్తాయి.

తాతగారు లేత సొరకాయ చూపించి "ఏదీ నీ చేత్తో కొయ్యి" అన్నారు.

ఆ సొరకాయకి వున్న నూగారు తడిమితే ఇలాంటి కూరగాయల స్పర్శ ఎప్పుడూ అనుభవించలేదు అనిపించింది.

"పాలుపోసి వండితే మా ధీరూకి ఇష్టం" అన్నారాయన.

"నూపిండి పెట్టి వండితే మా సీత ఇష్టంగా తినేది" అన్నారు అరవింద.

ఓ కూర అయినా, ఓ పండైనా.. ఓ పలకరింపు అయినా ఓ కబురు అయినా ఎవరికో ఒకరికి ఇష్టం అని చెప్పడంలో ఆ అవతలి మనిషి మీద వీరికున్న శ్రద్ధ కనపడుతోంది.

రాజరాజేశ్వరి ఆలయానికీ, దగ్గర్లోనే వున్న శివాలయానికీ, రాములవారి గుడికీ తీసుకెళ్ళారు తాతగారు.

"ధీరూ తండ్రి వాడి చిన్న తనంలోనే కాలం చేసాడు. మా అరవిందకి అన్నెం పున్నెం తెలీదు. దానికి మంచి కొడుకు పుట్టాడు. అలాగే మంచి కోడలు రావాలని రోజూ రామయ్యని వేడుకుంటాను" అన్నారు.

కాసేపు గుడి అరుగుమీద కూర్చుని ధ్యానం చేసుకున్నారు.

నేను కోనేటిలో వాలే పిట్టల్నీ తెల్లగా వెన్న ముద్దల్లా పూసిన కలువల్ని చూస్తూ కాలం గడిపాను.

తరువాత తాతయ్య "ప్రేయర్ ఈజ్ టాకింగ్ టు గాడ్, మెడిటేషన్ ఈజ్ లిసనింగ్ గాడ్." అన్నారు.

అప్రయత్నంగా అల్లరిగా "ప్రసాదం ఈజ్ ఎంజాయింగ్ గాడ్! తీసుకుందాం అండి" అన్నాను.

ఆయన నవ్వుతూ లేచి "రామ్మా" అని, కౌంటర్‌లో అతనితో "పులిహోరా, దద్దోజనం ఇయ్యి రావుడూ. మా పట్నం పిల్లకి మన రామయ్య ప్రసాదం రుచి తెలియాలి" అన్నారు.

సాయంత్రం వసారాలో, రుబ్బురోలులో గోరింటాకు రుబ్బి, నా చేతిలో బంతి ఆకువేసి, దానిమీద పెట్టారు అరవింద.

"మందారంలా పూస్తే మంచి మొగుడొస్తాడు" అన్నారు.

ఏ మురిపాలూ అనుభవించని ఈ అమాయకురాలు ఇంకా నమ్ముతోందా ఈ మాట? అనిపించింది.

నా రెండు చేతులకీ ఆవిడ గోరింటాకు పెడ్తుంటే, మోటర్ సైకిల్ మీద ధీరజ్ వచ్చాడు. వెనకాల పాలేరు ఒక స్టీలు క్యాన్ పట్టుకుని దిగాడు.

"అమ్మా నాయుడుగారి బర్రె ఈనిందిట. జున్ను పంపించారు" అన్నాడు తల్లితో ధీరజ్.

"జున్నా? ఓసారి తిన్నాను. చాలా ఇష్టం" అన్నాను.

"రెండు చేతులకీ గోరింటాకు పెట్టించుకుని ఏం తింటావులే?" అన్నాడు ధీరజ్.

"నేను అన్నం కలిపి పెడ్తాగా" అన్నారు అరవింద.

వేడి వేడి అన్నం, కాకరకాయ వేపుడూ, కంది పచ్చడీ, ఆవకాయా, పచ్చి పులుసూ, అందులోకి వెన్నపుసా, గెడ్డ పెరుగూ తీసుకొచ్చి, వసారాలో పెట్టి, వెన్నల చార పొడుగ్గా పడ్తుంటే, వెండి కంచంలో అన్నం కలిపి నాకూ, ధీరజ్‌కీ ముద్దలు పెడ్తూ "మా ఊళ్ళో అత్తాకోడలు రేవు వుంది చూసావా? అక్కడ ఓ అత్తాకోడలూ గొడవ పడ్తుంటే లక్ష్మీదేవీ, సరస్వతీ దేవి వచ్చి 'మీరు గొడవ మానేస్తే వెండి ఆకూ, రాగి ఆకూ ఇస్తాం. గొడవ ఆపెయ్యండి' అన్నారట. ఇద్దరూ 'అలాగే తల్లీ' అని గొడవ ఆపేస్తే, ఓ వెండి ఆకుల రావి చెట్టూ, రాగి ఆకుల చెట్టూ అక్కడ మొలిచాయిట. ఇప్పుడు అక్కడ విగ్రహాలున్నాయి. రేపు వెళదాం సరేనా? " అని ఆవిడ కథలు చెప్తూ కడుపు నిండిపోయేటంత అన్నం పెట్టేసారు.

ధీరజ్ పెరుగన్నం తినలేదు.

"వీడంతే పెరుగు తినడు. వేడి చేస్తుందంటే వినడు" అన్నారావిడ.

ఇలా కబుర్లు చెప్తూ మా అమ్మ తమ్ముడికీ నాకూ అన్నం కలిపి పెట్టేది. ఇలా ఇంకో అమ్మకి పరాయి పిల్లల మీద ఇంత ఆపేక్ష వుండడం నాకు ఊహకి అందని విషయం. పల్లెటూరు వాళ్ళకి మాత్రమే ఇంతింత ఆపేక్షలుంటాయా అని కూడా అనిపించింది.

సెల్‌లో అత్తయ్యకి ఫోన్ చేసి, అరవిందగారికి సర్‌ప్రైజ్‌గా అత్తయ్య స్వరం వినిపించాను.

"సీతా!" అని కళ్ళనిండా నీళ్ళతో ఎంతసేపో మాట్లాడారు. ఎంత ఆనందమో స్నేహితురాలి స్వరం వినగానే.

అత్తయ్య నాతో "ధీరజ్ ఏమన్నాడమ్మా? తప్పు నా కూతురి వైపే వున్నా. ఏదో ఆశ. అతని మనసు మారుతుందనీ పరి సంగతి తాతగారికీ ,అరవిందకీ తెలీదుగా?" అంది భయంగా.

"లేదు! నేనింకా మాట్లాడలేదు. వచ్చాక చెప్తాలే" అన్నాను.

గోరింటాకు ఎర్రగా మందారంలా పూసింది. రాత్రి నా చేతుల్ని చూస్తుంటే, ద్వారక గుర్తొచ్చాడు. ఫోన్ చేసాను.

"హాయ్ ఏంజెల్ వాట్సప్‌లో నా మెసేజ్‌లకి సమాదానం లేదేమిటి? ఎవరైనా ఇంట్రెస్టింగ్ క్యాండిడేట్ దొరికాడా?" అడిగాడు.

"వాట్సప్‌లో నువ్వు పంపేవి మెసేజ్‌లు కావు. ముద్దులు. వాటికి జవాబులు ఫోన్‌లో ఇచ్చేటంత పిచ్చి నాకు లేదు అన్నాను.

"ఏం చేస్తున్నావు అసలు అంత బిజీగా?" అన్నాడు.

"నేను ఇప్పుడు ఎక్కడున్నానో చెప్పుకో" అన్నాను.

"కొంపదీసి మళ్ళీ సియాటిల్ వచ్చేసావా? నేనూ నా కౌగిలీ, ముద్దులూ గుర్తొచ్చి" అన్నాడు.

"కాదు ధీరజ్ వాళ్ళ పల్లెటూరు వచ్చా" అన్నాను.

"ఏయ్! నమ్మక ద్రోహీ వాడు నాకన్నా నచ్చేసాడా?" అన్నాడు.

"మరేం.. పరి ఎలాగూ వదిలేసింది కదా! అని నేను చేసుకుందామని వచ్చాను. అరవింద ఆంటీకీ తాతగారికి నేను తెగ నచ్చేసాను. నా చేతిలో బంతి ఆకు వేసి గోరింటాకు కూడా పెట్టారు ఆంటి" అన్నాను.

"వాడు ముద్దులు కూడా పెట్టాడా?" ఉక్రోషంగా అడిగాడు.

"చాల్లే ఉడుకుమోతా! పెళ్ళీగిళ్ళీ వద్దు. ఓనర్‌షిప్ రైట్స్‌లా అనేవాడికి ఈర్ష్య ఎందుకుటా?" అన్నాను.

"నీ చేతిలో ఐస్ ఫ్రూట్ పక్కవాడు నాకితే ఊరుకుంటావా?" అన్నాడు.

"ఛీ ఏబ్రాసి మాటలు. అసలు సున్నితత్వం, లాలిత్యం లేదు" అన్నాను.

COMMENTS